క్లుప్తంగా

మినీ స్టేడియం డిజైన్ పరిశీలన

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో నిర్మించతలపెట్టిన మినీ స్టేడియం డిజైన్‌ను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం పరిశీలించారు. జంగారెడ్డిగూడెం రోడ్‌లో ప్రతిపాదించిన స్థలంలో 8 లేన్ల వాకింగ్ ట్రాక్, మినీ స్టేడియం నిర్మాణానికి అధికారులు రూపొందించిన డిజైన్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇప్పటికే రూ.2.5 కోట్ల నిధులు మంజూరయి ఉన్నాయని.. ఇంకా మరో 2.5కోట్ల మేర నిధులు అవసరం అని తెలిపారు. ఆ నిధులు మంజూరు చేయించే బాధ్యత తనదని.. స్టేడియం రాష్ట్రానికే ఆదర్శంగా ఉండే విధంగా నిర్మాణం చేయించాలని సూచించారు. క్రీడా ప్రాంగణంలో చెట్లు తొలగించేందుకు అనుమతులివ్వాలని తహసీల్దార్ కృష్ణప్రసాద్‌ను కోరారు. కార్యక్రమంలో ఖమ్మం అథ్లటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్ ఎండి.గౌస్, డిప్యూటీ స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ పరంధామరెడ్డి, పీఆర్ డీఈఈ శ్రీధర్, ఏఈఈ ఎం.అక్షిత, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి కోటమర్తి శ్రీరామమూర్తి ఉన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష వితరణ


చెక్కును తహసీల్దార్‌కు అందజేస్తున్న విద్యాలయ యాజమాన్యం

చర్ల: ఖమ్మం వరద బాధితులకు బాసటగా నిలిచేందుకు తనవంతు సాయంగా రూ.లక్షను అందించేందుకు రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం వ్యవస్థాపకుడు, హృద్రోగ నిపుణుడు డాక్టర్ డీఎస్ కుమార్ ముందుకు వచ్చారు. ఈ మేరకు బుధవారం చర్లలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో వైస్ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ నర్సింహారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన తరుపున విద్యాలయం ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది తహసీల్దార్ ఎం.శ్రీనివాస్‌కు రూ.లక్ష చెక్కు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. డీఎస్ కుమార్ దాతృత్వాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈదయ్య, విద్యాలయం అధ్యాపకులు జీపీ నర్సింహారావు, బి.క్రాంతి కుమార్, బోసు బాబు, ప్రదీప్‌కుమార్, ఉస్మాన్ సునీత, పద్మ, రమాదేవి, చైతన్యశ్రీ పాల్గొన్నారు.

రుణాలు అందజేయాలి

గుండాల: మండలంలోని రైతులందరికీ రుణాలు అందించాలని, అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలని ప్రజాపంథ (మాస్‌లైన్) రాష్ట్ర నాయకులు నాయిని రాజు, మండల కార్యదర్శి కొమరం శాంతయ్యలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కాచనపల్లి ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ..ఈ బ్యాంకు వద్ద తక్కువ మందికి రుణమాఫీ జరిగిందని, రుణమాఫీ జరిగిన రైతులకు తిరిగి రుణాలు చెల్లించడంలో బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సకాలంలో రైతులకు రుణాలు అందకపోవడం వల్ల రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు సమస్యలను పరిష్కంచాలని డిమాండ్ చేశారు. మండల డివిజన్ నాయకులు బొర్ర వెంకన్న, గొగ్గిల వెంకటేశ్వర్లు, చంద్రయ్య, గణేష్, కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

భద్రాచలంఅర్బన్: ఇటీవల జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించగా.. వారిలో పట్టణంలోని రంగనాయికల గుట్ట మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయురాలు ఉమాదేవి ఎంపికయ్యారు. ఈ క్రమంలో రాష్ట్ర మంత్రులు చేతుల మీదగా ఈ నెల 5వ తేదీన ఈ అవార్డును ఆమె అందుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆమెను భద్రాచలంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోశిరెడ్డి, ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి, దల్లి శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ అభియాన్

ములకలపల్లి: పొగళ్లపల్లి జీపీ పరిధిలోని రాజుపేట కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీడీపీఓ సీత మాట్లాడారు. పోషకాహార ఆవశ్యకతను వివరించారు. గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు చేశారు. సూపర్‌వైజర్ సామ్రాజ్యం, చైల్డ్‌లైన్ ఉద్యోగి బాలరాజు, ఏసీడీఎస్ సోషల్ వర్కర్ బాబు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

దమ్మపేట: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా సభ్యుడు కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు పిట్టల అర్జున్, దొడ్డా లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, పిల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోదారి మూడో‘సారీ’

- వరుసగా నీటమునుగుతున్న పంటలు
- పరీవాహక భూముల్లో సాగు ప్రశ్నార్థకమే
- కోలుకోలేని నష్టంలో రైతులు


గోదావరి వరదలకు నీటమునుగుతున్న పత్తి మొక్కలు

బూర్గంపాడు: గోదావరి పరివాహక ప్రాంతాల రైతులపై గోదారి కన్నెర్ర చేస్తుంది. ఈ ఏడాది ఇప్పటికే మూడుసార్లు గోదావరి వరద రెండో ప్రమాద హెచ్చరికను దాటింది. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వరుసగా గోదావరి వరదలు వస్తుండటం రైతులను కలవరపెడుతుంది. గోదావరి వరదలతో పరివాహక ప్రాంతాల భూముల్లో పంటల సాగు ప్రశ్నార్థకమవుతుంది.రైతులు ఇప్పటికే రెండుసార్లు వేసుకున్న పంటలు వరదతో నీటమునిగి పూర్తిగా దెబ్బతిన్నాయి. మూడోసారి పంటలు వేసేందుకు రైతులు నిరాసక్తతను వ్యక్తం చేస్తున్నారు.

భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లోని బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని గోదావరి పరివాహక భూములు తరచు వరదలకు గురవుతున్నాయి. ఈ భూములలో వానాకాలం పంటల సాగు ప్రతిఏటా ఆలస్యమవుతుంది. ఈ ఏడాది పరిస్థితి మరింత దారుణంగా మారింది. అన్నిచోట్ల జూన్ నెలలో పంటల సాగు మొదలైతే. ఈ భూములలో మాత్రం రైతులు రెండు నెలలు ఆలస్యంగా పంటలు సాగు చేయాల్సి వస్తోంది. గోదావరి పరివాహక ప్రాంతాలలో ఈ ఏడాది రైతులు జూలై నెలలో పంటలు వేసుకున్నారు. పత్తి, వరి, కూరగాయల పంటలను సాగు చేశారు. జూలై నెల మూడవ వారంలో 54 అడుగుల మేరా గోదావరి వరదలు వచ్చాయి. దీంతో రైతులు వేసిన పంటలు నీటమునిగి పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు కొంత ఆలస్యంగా ఆగస్టు నెలలో రెండోసారి పంటలు వేశారు. ఆగస్టులో కూడా గోదావరి వరదలు రెండో ప్రమాద హెచ్చరికను దాటి పంటలను ముంచాయి. గోదావరి వరదలు తగ్గిన తరువాత రైతులు అదును దాటుతుందని మూడవసారి కూడా పంటలు వేసుకున్నారు. ప్రస్తుతం రైతులు వేసుకున్న పత్తి, మిర్చి, వరి, కూరగాయ పంటలను మంగళవారం వచ్చిన గోదావరి వరద మూడోసారి కూడా ముంచింది. దీంతో రైతులు ఏమి చేయాలో పాలుపోనటువంటి పరిస్థితులున్నాయి. ఇప్పటికే కొందరు రైతుల రెండుసార్లు, కొందరు రైతులు మూడుసార్లు పంటలు వేయటం జరిగింది. గోదావరి వరదలు వరుసగా పంటలను ముంచటంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. దీంతో కొందరు రైతులు తిరిగి పంట వేసేందుకు నిరాసక్తతను వ్యక్తం చేస్తున్నారు.

గోదావరి వరదలకు ముంపుకు గురవుతున్న భూములలో మళ్లీ పంటలు సాగుచేయటం ప్రశ్నార్థకమే అవుతుంది. పత్తి సాగు చేసే రైతులకు ఇప్పుడు గింజలు దొరకని పరిస్థితులున్నాయి. వరిసాగు చేసే రైతులకు నార్లు దొరకటం చాలా కష్టం. మిరప తోటలు వేసేందుకు నార్లు దొరికిన అదును దాటుతుందని రైతులు నిరాశను వ్యక్తపరుస్తున్నారు. కొందరు రైతులు వరదలు తగ్గిన తరువాత పెసర, మినుము చల్లుతామని చెబుతున్నారు. మరికొందరు రైతులు మాత్రం ఈ సీజన్ పంటలు వేయమని తేల్చి చెబుతున్నారు. ప్రతిఏటా గోదావరి వరదలకు పంటలు నష్టపోతున్న ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందటం లేదని రైతులు వాపోతున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద విత్తనాలు, ఎరువులు కూడా అందించకపోవటంతో పంటల సాగును పక్కకు పెడుతున్నామని రైతులంటున్నారు. ప్రభుత్వం పంటనష్ట పరిహారమందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రెండుసార్లు గోదావరి ముంచింది



జూలైలో పత్తి వేస్తే ఒకసారి వరదలకు మునిగింది. మళ్లీ ఆగస్టులో పత్తి గింజలు రెండోసారి వేశాను. మంగళవారం వచ్చిన గోదావరి వరదకు ఆరెకరాలలో పత్తి పూర్తిగా మునిగిపోయింది. మళ్లీ పంట వేయాలంటే చేతిలో చిల్లిగవ్వ లేదు. ప్రభుత్వం సాయమందిస్తేనే ముందుకు సాగేది.

– చెంచలపు రాములు, రైతు, నాగినేనిప్రోలు

ఏటా నష్టమే..



గోదావరి వరదలతో ప్రతి ఏటా వానాకాలం పంటలు నష్టపోతున్నాం. ఈ ఏడాది ఇప్పటికే మూడుసార్లు పంటలు వరదలకు మునిగి దెబ్బతిన్నాయి. మళ్లీ పంటలు వేస్తే గోదావరి వరద రాదనే నమ్మకం లేదు. వరద ముంపుకు గురై భూములకు ప్రభుత్వం పరిహారమందించి రైతులను ఆదుకోవాలి.

– యడమకంటి లింగారెడ్డి, రైతు, రెడ్డిపాలెం

వెంగళరాయ సాగర్ కుడి కాలువకు గండి


కుడి కాలువకు పడిన గండి

చంద్రుగొండ: మండలంలోని సీతాయగూడెంలో గల వెంగళరాయ సాగర్‌కు బుధవారం గండి పడింది. భారీ ఎత్తున నీరు వృథాగా ప్రవహిస్తోంది. సమాచారం అందుకున్న నీటిపారుదల శాఖ ఈఈ అర్జున్, డీఈఈ కృష్ణ శంకర్, ఏఈఈ నరసింహారావు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ప్రాజెక్టు కింద 2200 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. సీతాయగూడెం, దామరచర్ల, అయ్యన్నపాలెం, చంద్రుగొండ, ఇమ్మడి రామయ్య బంజర్, ఇందిరానగర్, మహ్మద్ నగర్, తిప్పనపల్లి గ్రామాలకు చెందిన రైతుల భూములు సాగవుతాయి. నాలుగేళ్ల క్రితం ప్రాజెక్టు అలుగు భాగంలో పెద్ద ఎత్తున గండి పడింది. ప్రతి ఏటా తాత్కాలిక మరమత్తులు చేసి శాఖాధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఇటీవల కాలంగా కురిసిన భారీ వర్షాలకు అలుగు ప్రాంతంలో గండి సైతం అగాధంగా మారింది. ఇదిలా ఉండగా తాజాగా కుడి కాలువకు గండి పడటంతో ఆయకట్టు రైతులలో మరింత ఆందోళన నెలకొంది. శాశ్వత మరమత్తుల కోసం రూ.34 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి.

సందర్శించిన కాంగ్రెస్ నాయకులు..

సీతాయగూడెం కుడి కాలువకు గండి పడటంతో ఆప్రాంతాన్ని కాంగ్రెస్ మండల నాయకులు సందర్శించారు. ఆ ప్రాంతం నుంచే ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు సమాచారం అందించారు. సత్వరమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని, త్వరలోనే శాశ్వత పనులు చేపట్టేలా అధికారులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భోజ్యా నాయక్, సారేపల్లి శేఖర్, దారావత్ రామారావు, సంకా శంకర్, ఫజల్‌భక్ష్, కీసరి భద్రయ్య, వై.శివ, బన్నే నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలి

మణుగూరురూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో కూడా రాణించాలని మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.భద్రయ్య సూచించారు. తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఒలంపియాడ్‌లో 53కేజీల విభాగం బెంచ్ ప్రెస్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన బీఏ ప్రథమ సంవత్సర విద్యార్థి పి.పాండురాజు ను బుధవారం కళాశాలలో ప్రిన్సిపల్ భద్రయ్య, అధ్యాపకులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి ఒలంపియాడ్‌లో తమ కళాశాల విద్యార్థి ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వాలియా, అధ్యాపకులు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ సాంబమూర్తి, రామతిరుపతి, బూర్గుల సతీష్, లక్ష్మణ్, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాజాతా ప్రదర్శన

ములకలపల్లి: మండలకేంద్రంలోని మంగపేట పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం కళాజాతా ప్రదర్శన చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణా సాంస్కృతిక సారథి కళాకారులచే సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగత్తలపై అవగాహన కల్పించారు. స్థానిక వైద్యాధికారి సాయిదీపక్ రెడ్డి, హెల్త్ కమ్యూనిటీ ఆఫీసర్ సీత, కళాసారథి టీం లీడర్ బాలు కాంపల్లి, ఆలవాల కృపానందం, షేక్ ముసా, డప్పు నరేంద్ర, కుమారి. స్నేహ, నీలా, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

మణుగూరుటౌన్: వరద ప్రభావంతో ముంపునకు గురైన మున్సిపాలిటీ, సమితిసింగారంలోని వాగు మల్లారం బాధితులకు సర్వే నివేదిక అనంతరం ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేస్తారని తహసీల్దార్ రాఘవరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాగా కొందరికి మాత్రమే ఆర్థిక సాయం చెక్కులు మంజూరు అయ్యాయని, మరికొందరికి ఇంతకు ముందే సేకరించిన వివరాల ఆధారంగా వారి ఖాతాలకే సాయం బదిలీ అవుతుందని తెలిపారు.

ముగిసిన బస్‌పాస్ శిబిరం

ములకలపల్లి: కొత్తగూడెం డిపో ఆధ్వర్యంలో బుధవారం ములకలపల్లిలో దివ్యాంగులకు ఏర్పాటు చేసిన బస్‌పాస్ శిబిరం విజయవంతమైంది. ఈశిబిరంలో 12 మంది దివ్యాంగులకు రాయితీ బస్‌పాస్‌లను అందజేశారు. నిర్వాహకులు నరేంద్ర కుమార్, సామ్యూల్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి


గుండాల: అంగన్‌వాడీ స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

గుండాల: మండలంలోని అన్ని పంచాయతీ కేంద్రాల్లో ఏ సమస్య ఉన్నా ఆ సమస్యలను పరిష్కరించాలని, తన దృష్టికైనా తీసుకురావాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన గుండాల మండలంలో పర్యటించి అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా 23 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వివిధ శాఖల అధికారులకు అభివృద్ధి పనులపై, జరుగుతున్న పనులపై నివేధికలు అందించాలని పదే పదే చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మంచినీరు అందని గ్రామాల్లో నల్లాలు ఏర్పాటు చేసి తాగునీరు అందించాలన్నారు. రిపోర్టు అందించని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను క్లుప్తంగా రాసి తనకు నివేధికలు అందించాలని తెలిపారు. సాగునీరు, విద్యా, వైద్యం, అంగన్‌వాడీ, ఫారెస్టు, రెవెన్యూ అధికారులతో స్థానిక సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. జీరో బిల్లు కరెంటు రానటువంటి లబ్ధిదారుల నుంచి వివరాలు తీసుకోవాలని, కరెంటుకు అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత విద్యుత్ శాఖ ఏఈని ఆదేశించారు. అంగన్‌వాడీ భవనాలకు స్థలాలు చూడాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. నత్తనడకన సాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతం చేయాలని ఆర్‌అండ్‌బీ ఏఈని ఆదేశించారు. రైతుబంధు రాని వారినుంచి దరఖాస్తులు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను కోరారు. పోడుభూముల జోలికి ఫారెస్టు అధికారులు పోవద్దని అన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి, గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. బతుకమ్మ ఘాట్‌ను పరిశీలించి నిర్మానం కోసం ప్రణాళికలు వేయాలని ఇరిగేషన్ ఏఈని సూచించారు. కొమరారం వయా చెట్టుపల్లి నుంచి గుండాలకు ఆర్టీసీ బస్‌ను త్వరలోనే తిరిగేలా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధు, మండల ప్రత్యేక అధికారి కుర్షీద్, తహసీల్దార్ ఇమ్మానుయెల్, ఎంపీడీఓ సత్యనారాయణ, రేంజర్ నర్సింహారావు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖదీర్, కొడెం ముత్యమాచారి, ముత్తయ్య, దారా అశోక్ పాల్గొన్నారు.

పరామర్శ..

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బలగాని జగన్నాథం ఇటీవల మృతి చెందగా బుధవారం దశదినకర్మ కార్యక్రమం నిర్వహించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దశదినకర్మ కార్యక్రమానికి హాజరై జగన్నాథం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డీఎస్‌ఆర్సీ కౌన్సిలర్ ఉద్యోగానికి దరఖాస్తులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గల ఏఆర్‌టీ సెంటర్ నందు డీఎస్‌ఆర్సీ కౌన్సిలర్ ఉద్యోగానికి గాను దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాగా ఈ ఉద్యోగం కాంట్రాక్టు పద్ధతిలోనే భర్తీ చేస్తామని, ఇందు కోసం డిగ్రీ లేదా పీజీలో (సోషియాలజీ/సైకాలజీ/సోషల్ వర్క్/అంత్రోపాలజీ/హ్యూమన్ డెవలప్మెంట్) పూర్తి చేసి నర్సింగ్‌లో మూడు ఏళ్ల పాటు అనుభవం ఉండాలని ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సెప్టెంబర్ 12 నుంచి 18వ తేదీ వరకు అన్ని పనిదినాలలో ఆస్పత్రి ఆవరణలోని ఏఆర్టీ సెంటర్‌లో తమ దరఖాస్తులను సమర్పించాలని, లేదంటే 9963130775 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపు బహిరంగ వేలం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ ఇన్‌గేట్ వద్ద ఉన్న కనక దుర్గ అమ్మవారి దేవస్థానం ఆవరణలోని రెండు షాపులను నెలవారి అద్దె చెల్లించే విధంగా మూడు సంవత్సరాలకు లీజుకు ఇవ్వడానికి ఈనెల 13న బహిరంగ వేలం నిర్వహించబడునని ఆలయ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు బహిరంగ పాల్గొనే వారు షాపుకు రూ10 వేల చొప్పున ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవల్సిందిగా వారు పేర్కొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు


మణుగూరురూరల్: పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శివకుమార్

మణుగూరురూరల్: వరద ముంపు ప్రాంతాలైన సాయినగర్, విప్పలసింగారం, బాంబేకాలని, పగిడేరు, సంతోష్‌నగర్, బాపనకుంట, శేషగిరినగర్, గాంధీనగర్, మేదరబస్తీ, రాజుపేటలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆయా శిబిరాల్లో వైద్యాధికారి శివకుమార్, వైద్యులు, సిబ్బంది వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని నడికుడి గ్రామంలో డాక్టర్ సుభాష్ ఆధ్వర్యంలో బుధవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపులో భాగంగా జ్వర పీడితులకి రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఇంటింటికి సర్వే నిర్వహించి నిలువ నీటిని గుర్తించి తొలగించారు, క్యాంపులో నర్సాపురం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని మర్రిగూడెం, రంగాపురం గ్రామాల్లో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వైద్యశిబిరాల్లో మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రకాశ్‌రావు, సిబ్బంది సుశీల, జయలక్ష్మి, వాణి, రాందాస్, కోటేశ్వరరావు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గాండ్రాల గ్రామంలో వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 43 మందికి వైద్య పరీక్షలు చేసి, ఐదుగురు వైరల్ జ్వరాలలతో బాధపడుతున్న గుర్తించి వైద్యం చేశారు. అలాగే జ్వరపీడితులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణ, విజయ్ రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరకగూడెం: మండల పరిధిలోని తుమ్మలగూడెం, దేవరనాగారం గ్రామాల్లో కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. సుమారు 72మంది గ్రామస్థులను పరీక్షించి అందులో పలువురిని జ్వర పీడితులను గుర్తించి మందులను అందజేశారు. అనంతరం గ్రామాల్లో కలియ తిరుగుతూ నిల్వ ఉన్న నీటినీ సిబ్బందితో పారబోయించారు. హెచ్‌ఈఓ పోలెబోయిన కృష్ణయ్య, ఆరోగ్య సహాయకులు నర్సింహారావు, కృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో పూడికతీత పనులు

కరకగూడెం: మండల కేంద్రంలోని డ్రెయినేజీలో బుధవారం కరకగూడెం తహసీల్దార్ నాగ ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్ ఆధ్వర్యంలో జేసీబీ యంత్రం ద్వారా పూడికతీత పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రెయినేజీలో చెత్తా చెదారం వెయ్యకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలని వ్యాపారస్తులకు సూచించారు. డ్రెయినేజీను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి మారుతీ యాదవ్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి


భద్రాచలంటౌన్: అమరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది

భద్రాచలంటౌన్: అటవీశాఖలో విధి నిర్వహణలో అమరులైన వారి త్యాగాలు మరువలేనివని భద్రాచలం డివిజన్ అటవీశాఖ అధికారి సుజాత అన్నారు. అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా డివిజన్ కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయ అవరణలో బుధవారం అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీరప్పన్ చేతిలో ప్రాణాలు కోల్పోయిన ఐఎఫ్‌ఎస్ అధికారి శ్రీనివాస్ సంస్మరణార్థం ఏటా అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. అటవీ సంపద రక్షణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అధికారుల ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. సిబ్బంది వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని, అడవుల సంరక్షణకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓలు ద్వాలియా, కమల, సిబ్బంది పాల్గొన్నారు.

మణుగూరురూరల్: విధుల్లో అమరులైన అటవి అధికారులు, సిబ్బంది సేవలు చిరస్మరణీయమని మణుగూరు ఎఫ్‌ఆర్‌ఓ పి.ఉపేంద్ర అన్నారు. బుధవారం మణుగూరు అటవీశాఖ ఆధ్వర్యంలో జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు, సిబ్బంది శాఖా కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పాటై విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారిని నివాళ్లర్పించారు. అనంతరం ఎఫ్‌ఆర్‌ఓ ఉపేంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌ఓలు జి.సీతారాములు, కె.లక్ష్మయ్య, పి.నాగరాజు, ఎండి.ముజీబుద్దీన్, ఈ రామచంద్రయ్య, ఎఫ్‌బీఓలు, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూజలు.. ఊరేగింపు.. నిమజ్జనాలు


అశ్వారావుపేటరూరల్: నారాయణపురంలో సందడిగా సాగుతున్న ఊరేగింపు


మణుగూరుటౌన్: అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న సీఐ సతీష్‌కుమార్ దంపతులు


అశ్వాపురం: మొండికుంటలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ అశోక్‌రెడ్డి

ములకలపల్లి: గణేశ్ శరన్నవరాత్రి మహోత్సవాలు మండలవ్యాప్తంగా అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. వాడవాడలా కొలువుదీరిన గణనాథులకు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. తీరొక్కరీతిన నైవేద్యాలు సమర్పిస్తూ. భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు చేస్తున్నారు.

అశ్వారావుపేట: వినాయక చవితి సందర్భంగా అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర మండపాల వద్ద బుధవారం అన్నదానం నిర్వహించి ఊరేగింపుగా గణనాథులను తరలించి నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు మేళతాళాలలతో, నృత్యాలు చేస్తూ గణపతి విగ్రహాలను తరలించారు.

అశ్వారావుపేటరూరల్: వినాయక చవితి పండుగ సందర్భంగా మండపాల్లో కొలువు దీరిన గణనాథుల విగ్రహాలను పలు గ్రామాల్లో బుధవారం ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని అనంతారం, నారాయణపురం, ఆసుపాక, ఊట్లపల్లి, నందిపాడు, కావడిగుండ్ల, అచ్యుతాపురం, జమ్మిగూడెంతోపాటు పలు గ్రామాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పలు చోట్ల భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం గణనాథుల విగ్రహాలను మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, నృత్యాలు చేస్తూ ఘనంగా ఊరేగింపు నిర్వహించగా, గ్రామాల్లో సందడి నెలకొంది. అలాగే ఆయా గ్రామాల్లోని చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

అశ్వాపురం: అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని సీఐ అశోక్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య అన్నారు. మండల పరిధిలోని మొండికుంటలో తుమ్మలచెరువు రోడ్డులో వినాయకమండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని సీఐ అశోక్‌రెడ్డి ప్రారంభించారు. చవిటిగూడెంలో వినాయక నవరాత్రుల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య ప్రారంభించారు. కమిటీసభ్యులకు టీషర్ట్స్ పంపిణీ చేశారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ రోడ్డులో గణనాథునివద్ద అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత ప్రారంభించారు.

మణుగూరుటౌన్: మండలంలోని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాల వద్ద సీఐ సతీష్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పీవీకాలనీలో స్పెషల్ డి క్వార్టర్స్‌లో గణేశ్ విగ్రహం వద్ద కార్మిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లోని గణేశ్ మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించి భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా రాజీవ్‌గాంధీ నగర్‌లో గణపతి ఉత్సవాల నేపథ్యంలో తహసీల్దార్ రాఘవ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పుచ్చకాయల శంకర్, ఆలెం కోటి తదితరులు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.